ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 299 శనివారం 26-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..



# మూసీ పునరుజ్జీవం..
## బాపూ ఘాట్ అభివృద్ధి

- హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- వీటిని అడ్డుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్, బిజెపి
- సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు

**తొలి సమయం హైదరాబాద్,** మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోంది. కానీ గాంధీ వారసులుగా అంతర్జాతీయ స్థాయిలో బాపూ ఘాట్‌ను అభివృద్ధి చేసి తీరుతాం. కానీ బీజేపీ, బీఆర్ఎస్ వీటిని ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సదరన్ రైజింగ్ సమ్మిట్ లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. గాంధీ ఐడియాలజీ కేంద్రం గా బాపూ ఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా నగరంలోని బాపూ ఘాట్ ను అభివృద్ధి చేస్తాం. దేశం మొత్తం మాట్లాడుకుంటున్న సర్దార్ పటేల్ విగ్రహం తరహాలో హైదరాబాద్ లోని బాపూ ఘాట్‌లో మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం అన్నారు. తెలంగాణలో ఫాంహౌస్ పాలిటిక్స్ చేస్తున్నారని, దేశంలో ఎక్కడైనా ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఉన్నారా..అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్యాలెస్ పాలిటిక్స్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారం కోల్పోయినా కేసీఆర్ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ప్రజల తరఫున గొంతుక అసెంబ్లీలో వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై మాజీ సీఎం కేసీఆర్ కు నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు.కేసీఆర్ తనని తాను ఓ జమీందార్ గా భావిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రజలు ఎక్కువ రోజులు సహించరని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి, మాజీ సీఎం కేసీఆర్‌కి తాను ఒకటే మాట చెబుతున్నానని.. నిజంగానే అభివృద్ధి జరగాలని భావిస్తే తనతో మాట్లాడాలన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని రాజకీయాలు చేయాలని, దాంతో అభివృద్ధికి ఏ ఆటంకాలు ఉండవన్నారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రం వ్యతిరేకిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## సిజెఐగా జస్టిస్ ఖన్నా
# 11న ప్రమాణం

### ఆరు నెలలపాటు పదవిలో కొనసాగున్న ఖన్నా



**న్యూఢిల్లీ,అక్టోబర్25:** భారత సుప్రీం తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఆయన ఈ నెల 11న బాధ్యతలు చేపడతారు. కేవలంఆరు నెలలు మాత్రమే పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఖన్నా, ప్రస్తుత సిజెఐ చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ ఇప్పటికే జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖన్నా నియామకానికి ప్రభుత్వ ఆమోదాన్ని ధృవీకరిస్తూ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. జస్టిస్ ఖన్నా 183 రోజులు మాత్రమే సీజేఐ ఉండనున్నారు. అంటే ఆయన కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ పదవిలో ఉంటారన్నమాట. అతను మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్ రాజ్ ఖన్నా మేనల్లుడు జస్టిస్ సంజీవ్ ఖన్నా జబల్‌పూర్ కేసులో ఇచ్చిన తీర్పుతో ఆయన ప్రసిద్ధి చెందాడు.

### మంత్రి కొండా సురేఖకు
## కోర్టు మొట్టికాయ

ఇకముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దు

పరువు నష్టం కేసు విచారణ వచ్చే నెల 21కి వాయిదా



**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్25:** మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు మొట్టికాయలు వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మండిపడింది. ఓ బాధ్యత కలిగిన మహిళా మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిదని వ్యాఖ్యానించింది. అలాంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని తెలిపింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ ఎ÷-లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ జరిగింది. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ ఛానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో తొలగించాలని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

## పేదల ఇళ్ల జోలికి వస్తే
# ఖబర్దార్

- మూసీ సుందరీకరణ పేరుతో స్కామ్
- సుందరీకరణతో డబ్బులు దండుకునే యత్నం
- బిఆర్ఎస్ బాటలోనే రేవంత్ సర్కార్
- రాబర్ట్ వాద్రాకు ప్రాజెక్ట్ కట్టబెట్టే యత్నం
- మూసీ బాధితులకు మద్దతుగా ధర్నాలో బిజెపి నేతల విమర్శలు

### సుందరీకరణకు ఓకే... ఇళ్ల కూల్చివేతలకు నో

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

మూసీ సుందరీకరణకుతాము వ్యతిరేకం కాదని,మూసీ పరివాహకంలో పేదలను తరిమివేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని బిజెపి స్పష్టం చేసింది. పేదలకు అన్యాయం జరగకుండా మూసీ సుందరీకరణ చేపడితే తాము కరసేవ కూడా చేస్తామని స్పష్టం చేసింది. మూసీ పేదలకు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద బిజెపి చేపట్టిన ధర్నాలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. మూసీ ప్రాజెక్ట్‌కు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో నివాసం ఉండేందుకు మేము సిద్ధం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఇవ్వకపోగా ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసిపూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళ్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేక పోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు.. కానీ పేద ప్రజలకు మంచి చేయాలనేది మాత్రం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉంటుందని స్పష్టం చేశారు. వారికోసం అవసరమైతే చంచల్ గూడ జైలుకు అయినా, చర్లపల్లి జైలుకు అయినా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రేవంత్ పోలీసులతో వస్తాడా? ఎలా వస్తాడో కానీ బస్తీల్లోకి రావాలి. ఆయన్ను ప్రజలు ఏమనకుండా మేము రక్షణగా ఉంటాం.. సెక్యూరిటీ విషయంలో ఆయనకు చింత అక్కర్లేదు. డ్రైనేజీ సిస్టం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యం. రేవంత్‌కు పేదలకు కనీస సౌకర్యాలు అందించడం ముఖ్యమా.. మూసీ సుందరీకరణ అవసరమో తేల్చుకోవాలి. వాస్తవానికి మాకు రెండూ ముఖ్యమే.. కానీ ముందు పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించి తర్వాత సుందరీకరణ చేసేవాళ్ళం. కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశ, దశ లేదు. ఎలా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటారో కూడా తెలియడం లేదు. ఒక బస్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాష్టికానికి ఓ వ్యక్తి గుండెపోటుతో చనిపోయారని తెలిసింది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందకండి.. మీకు అండగా బీజేపీ ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. మూసీప్రాజెక్ట్ అంతా రాబర్డ్ వాద్రా కోసమే అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు, ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నారని అన్నారు. రాబర్ట్ వాద్రా ఇటీవల హైదరాబాద్ వచ్చి గుడిని దర్శించారని అంటున్నారని, అసలు విషయం మూసీ ప్రాజెక్ట్ కోసమేనని అన్నారు.



### నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్సలర్
## ఒలాఫ్ స్కోల్జ్ సమావేశం

పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



**న్యూఢిల్లీ25:**భారత ప్రధాని నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించేందుకు శుక్రవారం వీరిద్దరూ సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించను న్నారు. ముఖ్యంగా రక్షణ, వాణిజ్యం, స్వచ్ఛ ఇంధన రంగాలపై ఇరువురు నేతలు విస్తృత స్థాయిలో చర్చలు జరపున్నట్లు తెలుస్తోంది. 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో పాల్గొనే ందుకు జర్మనీ ఛాన్సలర్ గురువారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చారు. గురువారం అర్ధరాత్రి వచ్చిన ఛాన్సలర్‌ను రాష్ట్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిత్యానంద రాయ్ కలుసుకున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు స్కోల్జ్ అక్టోబర్ 24 నుంచి 26 వరకు భారత్‌లో అధికారి కంగా పర్యటిస్తారని ఇప్పటికే అధికారి కంగా ప్రకటించారు. మెరుగైన భద్రత, రక్షణ సహకారంతో పాటు ఆర్థిక సహకారం.. స్థిరమైన అభివృద్ధి భాగస్వామ్యంపై ఇరువురు నేతలు చర్చించ నున్నారని తెలుస్తోంది. అదే విధంగా శుక్రవారం ఢిల్లీలో జరగనున్న 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ సమ్మిట్‌లో ఇరువురు నేతలు పాల్గొననున్నారు. ఈ కార్యక్ర మంలో జర్మనీతో పాటు ఇతర దేశాలకు చెందిన వ్యాపారులు, అధికారులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొననున్నారు. అనంతరం జర్మీ ఛాన్సలర్ గోవాకు వెళ్లనున్నారు. భారత్, జర్మనీలు 2000 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగిఉన్నట్లు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

### ఎలాంటి బాంబులకైనా
# భయపడేది లేదు

పొంగులేటి బాంబుల వ్యాఖ్యలపై కెటిఆర్ స్పందన



**తొలి సమయం, రాజన్నసిరిసిల్ల,అక్టోబర్25:** దీపావళికి ముందే బాంబులు పేలుతాయన్న మంత్రి పొంగులేటి వయాఖ్యలపై స్పందించిన కేటీఆర్.. ఎవ్వరూ దీనికి భయపడరని అన్నారు. అయన పై జరిగిన ఈడి రైట్స్ కావచ్చని ఎద్దేవా చేశారు. లేదా సిఎ రేవంత్ రెడ్డి బావమర్దికి సంబంధించిన కేసులు కావన్నారు. ఎం చేస్తారో చేసుకోండని చెప్పారు. ఈ చిట్టి నాయుడు ఏం చేస్తాడని, చిల్లర కేసు పెట్టి జైలుకి పంపిస్తారు కావచ్చు అంతే అన్నారు. నిజమైన బాంబులకే భయపడలేదు, గీ సుతిల్ బాంబులకు భయపడతానా అని చెప్పారు. జగిత్యాల ఎంఎల్ఏ సంజయ్‌పై ఫైయ్యారు. ఆయనో రాజకీయ వ్యభిచారని విమర్శించారు. జగిత్యాలలో కాంగ్రెస్ నాయకులే ఒకరినొకరు చంపుకుంటున్నారని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని, త్వరలోనే బాంబులు పేలతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు, వైఎస్ఆర్ వంటి వారితోనే పోరాటం చేశామని.. మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండి.. నీ బాంబులకు భయపడలేదు. కేసులకు భయపడేది లేదు. మేం ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. దొంగ కేసులు పెడితే పెట్టుకో. నీ ఈడీ కేసులు, మోడీ కాళ్ళు మొక్కిన బాంబుల గురించి చెప్పు. చంద్రబాబు, వైస్సార్‌తోనే కొట్లాడినం.. ఈ చిట్టి నాయుడు ఓ లెక్కనా. అడ్డమైన కేసులు పెట్టి జైలుకు పంపితే పంపు.. ఆర్ఆర్ టాక్స్‌లపై మేం వచ్చాక లెక్క తెలుస్తాం. సీఎం రేవంత్ బామ్మర్ది, పొంగులేటి బాగోతాలు అన్నీ బయటకు తీస్తాం. చావుకు మేం భయపడం అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం సిరిసిల్లలో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ విచారణకు ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతలు అరెస్ట్ అవడం పక్కా అని తెలిపారు. గత సర్కారులో కీలక నేతలను నవంబరు 1 నుంచి 8 వరకు అందరినీ అరెస్టు చేస్తామని ప్రకటించారు. త్వరలోనే బాంబులు పేలతాయన్నారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన ప్రముఖులకు సంబంధించిన ఫైళ్లు సిద్ధం అయ్యాయన్నారు. కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుందన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్యూర్

**"హైడ్రా"పేరుతో తుది మొదలు లేని చర్యలు**

**రైతు రుణ మాఫీ లో ఫెయిల్.... రైతు బంధు ఇవ్వలేమని చేతులెత్తడం పక్కా మోసం!**

**విద్య విధానం పై అర్థం లేని చర్యలు....**

**ప్రభుత్వ వైద్యం పై కపటప్రేమ, ప్రైవేట్ వైద్యానికి లైన్ క్లియర్**

**మహబూబాబాద్ జిల్లా నిధులు ఏమయ్యాయి...మార్కెట్ ఎందుకు నిర్మాణం పూర్తి కావడం లేదు..జిల్లా మంత్రి.ఎమ్మెల్యే ఎంపీ ఏం చేస్తున్నారు అంటూ ధ్వజం...**

**కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ "తక్కెళ్లపల్లి రవీందర్ రావు" నిప్పులు**





**తొలి సమయం మహబూబాబాద్ ప్రధాన ప్రతినిధి అక్టోబర్ 26**
కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల పాలనలో పూర్తిగా ఫెయిల్యూర్ అయ్యిందని, దిశా నిర్దేశం లేకుండా ప్రజల సంక్షేమం పక్కన పడేశారని హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చి వేస్తున్నారంటూ చెరువు పై అవగాహన లేని చెత్త పాలకులు ఆంటూ శాసన మండలి సభ్యులు, ప్రతిపక్ష గొంతుక, బిఆర్ఎస్ ఫైర్ బ్రాండ్ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు నిప్పులు చెరిగారు . శుక్రవారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పండిన పంటను మొత్తం కొంటాము, ఆంటూ ప్రగల్భాలు పలికి క్వింట కు 500 బోనస్ ఇస్తమని,నాడు చెప్పిన కాంగ్రెస్ నేడు సన్న వడ్లకు బోనస్ అనే మాట మార్చిందన్నారు.రైతు భరోసా ఎగ్గొట్టి ,2 లక్షల రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు.రేషన్ కార్డు పేరుతో అనేక డొంక తిరుగుడు నాటకాలకు తెరతీసారన్నారు .వరదల వల్ల నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా ప్రజలకు ఇంత వరకు ఏమీ చేయలేని అసమర్థ ప్రభుత్వం.అన్నారు తెలంగాణ లో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది.మూసి మాటలు,హైడ్రా చర్యలు, సియోల్ పర్యటనలు ఇలా ఎన్నో రకాల అనాలోచిత నిర్ణయాల తో ప్రజలను భయ బ్రాంతులకి గురి గురిచేస్తున్నారని .విద్య వ్యవస్థను గందర గోలంగా తయారు చేశారని,అన్ని కమ్యూనిటీల విద్యార్థులను ఒకే వద్దకు చేర్చే స్కూల్స్ నిర్మాణం చేస్తామని విద్య విధానం గొప్పగా చేస్తామని చెప్పి నేడు మంచిగా నడిచే గురుకులా లను ముసివేయడానికి యత్నిస్తున్నారని అన్నారు..గ్రామాల్లో అభివృద్ధి ,ఆరోగ్యం పడకేసిందనీ గత బి అర్ ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృదికి పెద్ద పీట వేస్తే నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జ్వరానికి గోలీలు లేవని ప్రభుత్వ ఆసుపత్రి పక్కకు నెట్టి ప్రైవేటు ఆసుపత్రులకు పట్టం కడుతున్నారని విమర్శించారు. వచ్చిన వరద నిధులను వెనక్కి పంపిన అసమర్థ పాలకులు ఉన్న జిల్లా మన మహబూబాబాద్ జిల్లా.అని అవినీతి అదికారులను,గిరిజనులను పీక్కు తినే అధికారులను వదిలిపెట్టేది లేదనీ ఇందిరమ్మ ఇండ్ల పథకం గతంలో కాంగ్రెస్ పాలనలో దోచుకతిన్నట్లు, మళ్ళీ దోచుకతినడానీ%ఎవ% కమిటీలు వేషారని ప్రజలకు అన్యాయం చేసే ఆలోచన చేస్తే ఎవరిని వదిలిపెట్టమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి వైస్ చైర్మన్ వెంకన్న వార్డు కౌన్సిలర్లు వేణుమాధవ్, వెంకన్న మంగళంపల్లి కన్నా,తేళ్ల శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు

# అవినీతి దోపిడీపై కసితో కాంగ్రెస్‌ను గెలిపించారు అని మరువొద్దు

**- బిఆర్ఎస్ 2,200 ఇండ్లు ఇచ్చారు, కాంగ్రెస్ 14000వేల ఇండ్లు ఇవ్వబోతోంది**

**- 4హామీలు పూర్తి చేసాం. మిగిలినవి పూర్తి చేస్తాం!**

**- నిజాయితీతో కష్టపడ్డ కార్యకర్తలకు కాపాడుకుంటాను - ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్**







**తొలి సమయం, మహబూబాబాద్ అక్టోబర్ 26 :**
బిఆర్ఎస్ అవినీతి, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు కసితో కాంగ్రెస్ కు ఓట్ల యుద్ధం చేసి గెలిపించిన సత్యాన్ని మనం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. 54 వేల వేల మెజారిటీ తో కాంగ్రెస్ కు ప్రజలు పట్టం గట్టారు, అంటే ఆ ప్రభుత్వం పై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో తెలియజేస్తుంది అన్నారు..కురవి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు డాక్టర్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.. వరద బాధిత నష్టపరిహారానికి 20వేల కోట్లు కేంద్రాన్ని అడగ్గా కేవలం నాలుగు కోట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు.. పూర్తిస్థాయిలో ప్రభుత్వాన్ని లోటు బడ్జెట్ తో మనకు అప్పజెప్పారని.. ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్న లోపం లేకుండా పనిచేస్తున్నారని అన్నారు.. లోకల్ బాడీ ఎలక్షన్సగ్గర పడుతున్నాయని. కార్యకర్తలు కొత్త పాత అనే తేడా లేకుండా అందరూ కలుపుకొని పోవాలని అన్నారు.. ఇందిరమ్మ ఇండ్లు నిజాయితీగా పంపిణీ చేసే క్రమంలో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే.. సీరియస్ చర్యలు ఉంటాయని హెచ్చరిక చేశారు.. బూత్ కమిటీ, గ్రామ మండల కమిటీలు బలోపేతం చేయాలని అన్నారు, 6 గ్యారంటీలో నాలుగు గ్యారెంటీలను రీచ్ అయ్యామని ఇక రెండు గ్యారెంటీలను తప్పకుండా పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నామని అన్నారు.. బిఆర్ఎస్ దగ్గర అవినీతి డబ్బులు పోగయ్యాయని.. వాటితో మ్యానిప్లై చేస్తారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక చేశారు.. గెలిచాక కాంగ్రెస్లోకి వస్తామని మాయమాటలు చెబుతారు నమ్మవద్దు అన్నారు.. కురవి మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు ఎంపీటీసీలు కేవలం 30 40 ఓట్లతో విజయ సమీపంలోకి వచ్చి ఓటమిపాలయ్యారని. కురవి మండలం కాంగ్రెస్ పార్టీకి బలమైన మండలము అని గుర్తు చేశారు.. కార్యకర్తలు పాజిటివ్గా మాట్లాడాలని నెగటివ్స్ ఏమన్నా ఉంటే వ్యక్తిగతంగా నాతో మాట్లాడాలని అన్నారు.. కార్యకర్తల్లో రిలేషన్షిప్ ఆటిట్యూడ్ మోటివేషన్, క్యారెక్టర్, ఎబిలిటీ, నావిగేషన్, దేర్ ఎలా ఉండాలో తెలియజేశారు, చిన్న గూడూరులో... చిన్న గూడూరు మండలం దెయ్యారం గ్రామంలో ఆర్టీసీ బస్సును గ్రీన్ జెండా ఊపుతూ ప్రారంభించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ కార్యకర్తల్లో జ్యోష్ నింపారు.

**మరిపెడ మండల కేంద్రంలో**
పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో.. కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరభద్రం గౌడ్, గార్లపాటి వెంకటరెడ్డి, బండి లక్ష్మారెడ్డి, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లు సుధాకర్ రెడ్డి బండి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..



# క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

**ఘనంగా అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం**

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**






**తొలి సమయం హన్మకొండ, అక్టోబర్ 25**
క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జె.ఎన్.ఎస్. స్టేడియంలో అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించవచ్చు అని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలో, కళాశాలలో క్రీడల్లో రాణించడం వల్ల లాభాలపై బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అలాగే స్నేహపూర్వక వాతావరణం క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ , డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అందులో రేపు నిర్వహించబోయే క్రీడాంశాలు 1. కోకో, 2.టైక్వాండో,3. బాక్సింగ్, 4.చెస్, 5.జిమ్నాస్టిక్స్, 6.హాకీ, 7.వెయిట్ లిఫ్టింగ్, 8.ఆర్చరీ, 9.ఫెన్సింగ్ 10.అథ్లెటిక్స్ మొదలగు క్రీడలు జవహర్లాల్ నెహ్రూ స్టేడియం నందు నిర్వహించ బడునని ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, లేటెస్ట్ బోనఫైడ్, ఎస్.ఎస్.సి మెమో జిరాక్స్ ల పై తప్పనిసరిగా కాలేజ్ ప్రిన్సిపల్ సంతకం చేయించుకొని ఉదయం 8 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం నందు హాజరుకావాలని సూచించారు.జూడో క్రీడాంశము ఓ సిటీ స్టేడియం నందు నిర్వహించబడును. కావున క్రీడాకారులు నేడు ఉదయం ఉదయం 8 గంటలకు ఓ సిటీ స్టేడియం నందు లింగమూర్తి జూడో కోచ్ ను సంప్రదించగలరని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి జూనియర్ కళాశాల క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులకు కలెక్టర్ చేతుల మీదగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ డి ఐ ఈ ఓ గోపాల్ రావు, డాక్టర్ శ్రీధర్, వెంకట్ రెడ్డి, దస్రు నాయక్, బరపాటి గోపి, సతీష్, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రాయల్ సీడ్స్ వారి జయభేరి

**బిజి 2 ప్రత్తి విత్తనంపై రైతులకు అవగాహన**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 26:**
మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాయల్ సీడ్స్ వారి జయభేరి బిజీ 2 ప్రత్తి రకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ కంపెనీ ప్రతినిధి రాయల అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకొని, చెట్టుకు 100 నుండి 120 వరకు కాయలను కలిగి ప్రత్తి తీయుటకు సులభంగా ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం రైతు మేకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది 18 నుండి 20 క్వింటాళ్ల ప్రత్తి దిగుబడి వస్తుందని, పెట్టుబడి కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ సత్యనారాయణ రెడ్డి, శివాజీ రావు, మహేందర్, రమేష్, నరసింహారెడ్డి, కంపెనీ సిబ్బంది మల్లారెడ్డి, హరీష్, ఆంజనేయులు, రాజ్ కుమార్ లతో పాటు 20 గ్రామాల నుండి సుమారు 800 మంది పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో, ప్రస్తుత డివిజన్లో తాగునీటి సమస్యను పరిష్కరించండి

**అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 149 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోండి**

**మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించిన కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్**

**తొలి సమయం కరీంనగర్, అక్టోబర్ 25**
కరీంనగర్ నగరపాలక సంస్థల్లో విలీనమైన గ్రామాల్లో , ప్రస్తుత ఆయా డివిజన్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఒకటో డివిజన్ బిజెపి కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విలీనమైన ఆయా డివిజన్లలో తాగునీటి అవసరాలకు సంబంధించి పైపులైన్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారనీ తెలిపారు. కరీంనగర్ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం , మంచినీటి పైపులైన్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా 149 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు . కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో విలీన గ్రామాలలో, ప్రస్తుత డివిజన్లలో కొత్తగా వాటర్ ట్యాంకులు, ప్రతి వీధిలో కొత్తగా పైప్ లైన్ల పనులను ప్రారంభించాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేసి సంవత్సర కాలం కావస్తుందని, , కానీ ఇంతవరకు విలీన గ్రామాలలో మంచినీటి పైపులైన్ పనులనుప్రారంభించలేదన్నారు రాబోయే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తాగునీటి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా మంజూరు అయిన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టి , అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. వీలిన గ్రామాల్లో , ఆయా డివిజన్ పరిధిలో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ను ఆయన ఈ సందర్భంగా కోరారు.

## డిస్ట్రిక్ట్ ట్రాక్ సైక్లింగ్ పోటీలో కరీంనగర్ జిల్లాకు చెందిన వంగల హృతికేష్ అద్భుతమైన ప్రతిభ

**సిల్వర్ మెడల్ కైవసం**



**తొలి సమయం కరీంనగర్ అక్టోబర్ 25**
ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు హైదరాబాద్ లోని వెలో డ్రాం లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాక్ సైక్లింగ్ పోటీలో కరీంనగర్ జిల్లాకు చెందిన వంగల హృతికేష్ అద్భుతమైనటువంటి ప్రతిభను కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. గత కొంతకాలంగా హైదరాబాదులో కోచ్ భార్గవ్ వద్ద సైక్లింగ్ లో శిక్షణ పొందుతున్న హృతికేశ్ అనతి కాలంలోనే సైక్లింగ్ లో ఎన్నో మెలకువలు నేర్చుకుని అద్భుతమైన ప్రతిభను కనబరుస్తూ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. అక్కడ సైక్లింగ్ లో శిక్షణ పొందుతున్న శిక్షణ ఇస్తున్న కోచ్ లు సైతం హృతికేశ్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు కరీంనగర్ కు మరొక సాయి కృష్ణ లాంటి ఆణిముత్యం లభించిందని అందరూ అభిప్రాయపడుతున్నారు. హృతి కేష్ గొప్ప ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక కావడం కరీంనగర్ జిల్లాకే గర్వకారణంగా చెప్పొచ్చు అలాగే 2000 మీటర్స్ ఫర్ షూట్ ఈవెంట్ లో కూడా సిల్వర్ మెడల్ సాధించి అందరిని ఆశ్చర్య చకితులను చేశాడు. వంగల హృతి కేష్ తన యొక్క గొప్ప ప్రతిభతో దినదినాభివృద్ధి చెందుతూ రాకెట్ లా ముందుకు దూసుకెల్తూ కరీంనగర్ జిల్లాకు గొప్ప కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెడుతున్నందుకు కేంద్ర హోం శాఖ సహాయ బండి సంజయ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్,నగర మేయర్ వై సునీల్ రావు, బి ఆర్ ఎస్ కరీంనగర్ అధ్యక్షులు చల్లా హరిశంకర్ ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందలి మహిపాల్,గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, అలాగే అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బి మధుసూదన్ రెడ్డి, సెక్రెటరీ సురభి వేణుగోపాల్, సైక్లింగ్ అసోసియేషన్ కు సంబంధించిన ప్రతి ఒక్కరూ హృ తికేష్ నీ హృదయపూర్వకంగా అభినందించారు.

## పెన్షనర్లకు శుభవార్త

**న్యూఢిల్లీ 25:** 80 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు కారుణ్య భత్యం అని పిలువబడే అదనపు పెన్షన్‌కు అర్హత పొందుతారని పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ ఇటీవల ప్రకటించింది. 80 ఏళు నిండిన కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీస్ పదవీ విరమణ పొందిన వారికి ఈ అనుబంధ ప్రయోజనాలను పొందేందుకు కొత్త మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి. తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలు ఈ అదనపు అలవెన్సుల పంపిణీ ప్రక్రియను మరింత సులభతరం చేస్తాయి.

**అదనపు పెన్షన్ క్రింది పద్ధతిలో చెల్లిస్తారు:**

80 నుండి 85 సంవత్సరాల వయస్సు: ప్రాథమిక పెన్షన్/ కారుణ్య భత్యంలో 20 శాతం

5 నుండి 90 సంవత్సరాల వయస్సు: ప్రాథమిక పెన్షన్/ కారుణ్య భత్యంలో 30 శాతం

90 నుండి 95 సంవత్సరాల వయస్సు: ప్రాథమిక పెన్షన్/ కారుణ్య భత్యంలో 40 శాతం

95 నుండి 100 సంవత్సరాల వయస్సు: ప్రాథమిక పెన్షన్/ కారుణ్య భత్యంలో 50 శాతం

100 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ: ప్రాథమిక పెన్షన్/కారుణ్య భత్యంలో 100 శాతం

# పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 25**
ప్రజల భద్రత నిరంతరం పనిచేస్తున్న పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌస్ విక్షించేందుకు నగరంలోని పలు విద్యా సంస్థల నుండి వచ్చిన విద్యార్థులకు పోలీసులు నిర్వహిస్తున్న విధులు, వారు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, అలాగే బాంబు డిస్పొజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చిన్నారులకు పోలీస్ తుపాకుల పనితీరు ను వివరించారు. ఈ ఓపెన్ హౌస్ కు తరలి వచ్చిన కాలేజీ యువత ప్రధానంగా పోలీస్ జాగిలాలతో అధిక సమయం గడపడం కొస మెరుపుగా నిలిచింది. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేనని, పోలీసులను మీ స్నేహితులుగా భావించాలని, ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను మరువద్దని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమం డీసీపీ సలీమా, రవీందర్, అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ లు అనంతయ్య, సురేంద్ర,దేవేందర్ రెడ్డి, ఆర్.ఐ లు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్,, సతీష్, ఇన్స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్ తో పాటు ఆర్.ఎస్.ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మాయి పిలిచిందని వెళ్లి.. బుక్కాయ్యాడు..!

**ఉత్తర్ ప్రదేశ్:** అక్టోబర్ 25 : ఉత్తర్ ప్రదేశ్‌లో తాజాగా అలాంటి నయా మోసమే ఒకటి వెలుగులోకి వచ్చింది. డేటింగ్ పేరుతో తీసుకెళ్లిన ఓ యువతి ఇచ్చిన షాక్‌కు యువకుడు కంగు తిన్నాడు. ఢిల్లీ చెందిన ఓ యువకుడు ఉత్తర్ ప్రదేశ్ ఘజియాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే అక్టోబర్ 21న అతనికి ఓ యువతి నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. దానికి అతను స్పందించడంతో ఇద్దరి మధ్య మాటమాట కలిసింది. అమ్మాయి కొంచెం రొమాంటిక్‌గా మాట్లాడడంతో అబ్బాయి ఆమె వలలో పడిపోయాడు. మంచిగా మాట్లాడిన యువతి ఇద్దరం కలుద్దామని కోరింది. అతన్ని కౌశాంబి మెట్రో స్టేషన్ వద్ద రమ్మని చెప్పింది. దీంతో యువకుడు అందంగా తయారయ్యి అక్కడి చేరుకున్నాడు. కాసేపటికి యువతీ వచ్చింది. అనంతరం హోటల్‌కు వెళ్దామని అమ్మాయి చెప్పగా యువకుడు సైతం సరే అన్నాడు. అనంతరం ఇద్దరూ కలిసి కౌశాంబి హోటల్‌లోని మొదటి అంతస్తులో ఉన్న టైగర్ కేఫ్‌కు చేరుకున్నారు. అయితే అక్కడి వాతావరణం మొత్తం అనుమానాస్పదంగా ఉన్నట్లు యువకుడికి అర్థమైంది. హోటల్‌కు సైన్ బోర్డు లేదు, ఆన్ లైన్‌లో వెతికినా కేఫ్ పేరు ఎక్కడా కనిపించలేదు. దీంతో వెంటనే అతను స్నేహితుడికి తన లైవ్ లొకేషన్ షేర్ చేశాడు. తనకు ఏదో అనుమానంగా ఉందని, తనను కిడ్నాప్ చేసే అవకాశం ఉందని మెసేజ్ చేశాడు. అయితే అమ్మాయి ఓ కూల్ డ్రింక్ ఆర్డర్ చేసింది. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత బయలుదేరే సమయంలో బిల్ వచ్చింది. అది చూసి యువకుడు ఒక్కసారిగా షాక్ అయ్యాడు. రూ.16,400 కట్టాలని హోటల్ సిబ్బంది చెప్పడంతో అయోమయానికి గురయ్యాడు. దీంతో హోటల్ సిబ్బందిని గట్టిగా నిలదీశాడు. యువకుడిని బలవంతంగా ఆపిన హోటల్ సిబ్బంది అతడు బయటకు వెళ్లేందుకు నిరాకరించారు. రూ.50వేలు కడితేనే వదులుతామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో విషయాన్ని తన స్నేహితుడికి చెప్పాడు. అతను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధితుడి వద్దకు వారు చేరుకున్నారు. దీంతో డేటింగ్ యాప్స్ ముఠా గుట్టురట్టు అయ్యింది. యువకుడు జరిగిన విషయాన్ని చెప్పగా పోలీసులు హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. వారి ఫోన్లను చెక్ చేయగా నలుగురు అమ్మాయిలు వివిధ డేటింగ్ యాప్స్‌లో వివిధ పేర్లతో ఖాతాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. యువకులకు వల పన్ని వారిని హోటల్‌కు తీసుకువచ్చి డబ్బులు దండుకుంటున్నట్లు గుర్తించారు. వెంటనే ఐదుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కటకటాల వెనక్కి పంపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆన్ లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పరిచమయ్యే అమ్మాయిలు, అబ్బాయిల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వద్దు

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా






**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 25**
పోలీస్ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు తెలిపారు. నెలవారీ నేర సమీక్షా భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డీసీపీ, ఏసీపీ,ఇన్స్పెక్టర్లు, ఎస్. ఐ లు పాల్గొన్న ఈ సమావేశం ముందుగా పోలీస్ కమిషనర్ పెండింగి కేసులు, నిందితుల అరెస్ట్,కేసుల దర్యాప్తు స్థితిగతులపై పోలీస్ కమిషనర్ సంబంధించిన పోలీస్ స్టేషన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేస్తూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం వుండాలని, సోషల్ మీడియా లోప్రచారం అయ్యే కథనలపై అధికారులు దృష్టి సారించాలని, అలాగే వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై కన్నేసి ఉంచాలని సిపి అధికారులకు సూచించడంతో పాటు శాంతి భద్రత అంశం పై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిం చాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులతో పాటు, సిపి కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, యాంటీ డ్రగ్స్ వి బాగానికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్ర నాయక్ అదనపు డీసీపీ రవి తో పాటు ఏసీపీ, ఇన్స్పెక్టర్లు, ఎస్. ఐ పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ

## - ప్రైవేట్ ఉపాధ్యాయుల హెల్త్ కార్డుల మంజూరి కృషి - పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి




**తొలి సమయం, కొత్తపల్లి,అక్టోబర్ 25**
తన విద్యా సంస్థల్లో నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి .నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం కరీంనగర్ మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు.రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యారంగంలో ఆల్ఫోర్స్ సంస్థలను స్థాపించి క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందిస్తూ లక్షలాది మంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా,,భావి భారత పౌరులుగా తీర్చిదిద్ధి.తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ను దక్కించుకున్నారు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనను పట్టభద్రులు ఉపాధ్యాయులు నిరుద్యోగులు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి నాలుగు జిల్లాలు పర్యటించానని అన్ని వర్గాల నుండి తనకు సానుకూలంగా స్పందన వస్తుందని అన్నారు. ప్రస్తుతం తాను ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు వెల్లడించారు నవంబర్ 6 లోపు ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు సులభతరం చేసేందుకు తాను మిస్డ్ కాల్ క్యాంపియన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. తాము కేటాయించిన నంబర్ కు మిస్డ్ కాల్ చేసినట్లయితే తమ సిబ్బంది నేరుగా వచ్చి ఓటు నమోదుకు సహకరిస్తారని అన్నారు.నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తాను రాజకీయంలోకి వస్తున్నట్టు తెలిపారు.గత కొన్నిసంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్టత సేవలు అందించారు. ఎమ్మెల్సీగా గెలిస్తే వచ్చే డబ్బులను పట్టభద్రుల అభివృద్ధికి నిరుద్యోగ యువత కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి వారికి తోడ్పడుతానని ఇప్పటికే ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు తప్పకుండా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.






## సాఫ్ట్ బాల్ క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీ హర్ష ఎంపిక



**తొలి సమయం, సైదాపూర్,అక్టోబర్ 25**
18.10.2024న కరీంనగర్ లో శాతవాహన యూనివర్సిటీ లో ఎస్జిఎఫ్ అండర్ 19 ఉమ్మడి కరీంనగర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో సోమారం మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీ హర్ష మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు,స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్‌లు అభినందించారు.

## ఎన్ హెచ్ఆర్‌సి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా వడ్డిక అనిల్ రెడ్డి

### నియామక ఉత్తర్వులు అందించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య



**తొలి సమయం, రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25**
జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) నేషనల్ చైర్మన్ స్వప్న. ఎం. ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా జిల్లాలోని ఇల్లంతకుంట మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారులు, ఆర్టిఐ కార్యకర్త వడ్డిక అనిల్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక ఉత్తర్వులు అందించారు. గతంలో జిల్లా ఇన్చార్జిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనిల్ రెడ్డి సేవలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధ్యక్షులుగా నియమించామని రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది సుంకనపల్లి రాము తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు వడ్డిక అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం నిజాయితీగా నిస్వార్ధంగా సేవ చేస్తానని అన్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంస్థ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని కమిటీలు పూర్తిచేసి పేద ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం ముందుండి కృషి చేస్తామని అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యులు ఓడేటి చంద్రశేఖర్ రెడ్డి, పాక శ్రీనివాస్ యాదవ్, సదన్న, విలాసాగరం పృథ్విరాజ్, రాచకొండ కనకయ్య, ఎండి హబీబ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పల్లె రాజు, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రాజశేఖర్, కరీంనగర్ టౌన్ అధ్యక్షులు ద్యాగతి హరీష్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు నరికే ఓదెలు, కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రావుల నాని నియామకం



**తొలి సమయం, వెంకటాపురం, అక్టోబర్ 25**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోదేం వీరయ్య, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చింతిరియాల రవికుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ సెల్ కమిషనర్ నాగగిరి ప్రియతమ్ ఆదేశాల మేరకు వెంకటాపురం మండలానికి చెందిన రావుల నాని నీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమించినట్టుగా ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి సుధాకర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరియాల రవికుమార్ ఆధ్వర్యంలో నియామక పత్రం రావులనానికి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టిపిసిసి మేంబర్ నల్లపు దుర్గాప్రసాద్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, మన్యం సునీల్, కిరణ్ వర్మ, పి ఎస్ సి ఎస్ చైర్మన్ చీడెం మోహన్రావు, కాంగ్రెస్ ములుగు జిల్లా బ్లాక్ అధ్యక్షుడు సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు బాలసాని వేణు, కిసాన్ అధ్యక్షుడు జల్లిగంపల కళాధర్,చిట్టి మల్ల దేవా, యాసం రమేష్, చెన్నం నరేష్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులకు రావుల నాని కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదిత్య థాకరేపై మిలింద్ దేవ్‌రా

**మహారాష్ట్ర అక్టోబర్ 25 :** మహారాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే తనయుడు ఆదిత్య థాకరేపై రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవ్‌రాను బరిలో దించాలని సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన పార్టీ నిర్ణయించింది. ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన పార్టీ అభ్యర్థిగా ఆదిత్య థాకరే నామినేషన్ దాఖలు చేసిన మరుసటి రోజే ఏక్‌నాథ్ షిండే పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. మిలింద్ దేవ్‌రా దక్షిణ ముంబై నుంచి ఇప్పటికే మూడు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏక్‌నాథ్ షిండే వర్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలను మిలింద్ దేవ్‌రాకు అప్పగించారు. అక్కడ ఆయన సమర్థంగా పనిచేయడంతో వర్లి ఆదిత్య థాకరే సొంత నియోజకవర్గం అయినప్పటికీ అక్కడ ఉద్ధవ్ థాకరే వర్గం శివసేనకు కేవలం 6,500 మెజారిటీ మాత్రమే వచ్చింది. ఇప్పుడు వర్లీలో ఆదిత్య థాకరే, మిలింద్ దేవ్‌రా మధ్య మాత్రమే పోటీలేదు. అక్కడ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన కూడా నియోజకవర్గంపై పట్టున్న సందీప్ దేశ్‌పాండేను బరిలో దించింది. కాగా ఆదిత్య థాకరే గురువారం వర్లి అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి కూడా వర్లి ప్రజలు కచ్చితంగా తననే గెలిపిస్తారని ధీమా వ్యక్తంచేశారు. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

# భారత్, చైనాల మధ్య కుదిరిన సయోధ్య

**- సరిహద్దు వెంబడి బలగాల ఉపసంహరణ - వెనక్కి వెళుతున్న ఇరు దేశాల బలగాలు**

**న్యూఢిల్లీ,అక్టోబర్25:** భారత్, చైనాల మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఇది చర్చలకు ఉన్న బలమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. అందుకు అనుగుణంగానే సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ తాజాగా మొదలైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని రెండు కీలకప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్ నుంచి రెండు దేశాల బలగాలు వెనక్కి మరలుతున్నట్లు భారత రక్షణశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాంతంలోని సైనిక సామగ్రి, ఇతర పరికరాలను భారత బలగాలు వెనక్కి తీసుకొస్తున్నట్లు ఆ అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను కూడా ఇరుదేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదికి పశ్చిమదిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు వెనక్కివెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈప్రాంతాల్లో సరిహద్దులకు ఇరువైపులా దాదాపు 10-12 తాత్కాలిక నిర్మాణాలు, 12 టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బలగాల ఉపసంహరణ ప్రక్రియంతా పూర్తయిన తర్వాత మరో 4-5 రోజుల్లో డెస్పాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు సమాచారం.


వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం.. 2020 గల్వాన్ ఘర్షణలకు ముందు నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి కొనసాగనుంది. ఇరుదేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని ఇరుదేశాల నేతలు మోదీ, జిన్‌పింగ్ ధ్రువీకరించారు. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాలు ఎల్ఏసీ వెంబడి భారీస్థాయిలో బలగాలను మోహరించాయి.

అప్పటినుంచి రెండుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరుదేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా.. ఘర్షణల కేంద్రమైన డెమ్చోక్, డెస్పాంగ్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి.

# ఒడిషాలో తీరం దాటిన దానా తుఫాన్

**- తీరం వెంట 120 కి.మీ వేగంతో గాలులు**

**- గాలుల ధాటికి పలుచోట్ల నేలకూలిన చెట్లు - తీరప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు**



**విశాఖపట్టణం,అక్టోబర్25:**వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని బిత్తర్‌కనిక జాతీయ పార్క్, ధమ్రా మధ్య గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ పక్రియ ప్రారంభమైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం ఉదయం వరకు ఇది కొనసాగి తుపాన్ బలహీనపడనుంది. తుపాను తీరం దాటే సమయంలో భద్రక్, కేంద్రపార జిల్లాల్లో గంటలకు 120 కి.మీ వేగంతో తీవ్రంగా గాలులు వీచాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. తుపాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యా సంస్థలకు శుక్రవారం సెలవు ప్రకటించాలని అధికారులు రెండు రాష్ట్రాలకు సూచించారు. కోల్‌కతా, భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌ను గురువారం సాయంత్రం శుక్రవారం 9 గంటల వరకు మూసి ఉంచనున్నారు. రెండు రాష్ట్రాల్లో మొత్తం 400 రైళ్లను రద్దు చేశారు. అధికారులు తుపాను ప్రభావితమయ్యే ప్రాంతాలను నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పక్రియ చేపట్టారు. తీవ్ర తుఫాన్ దానా .. శుక్రవారం తెల్లవారు జామున పూరి సమీపంలోని ధమ్రా- హబలి ఖాతి మధ్య ప్రాంతంలో తీరాన్ని దాటింది. దీంతో ఈ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.

గంటకు వంద నుంచి నూట ఇరవై కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాల్లు తీరం దాటి సమయంలో వీస్తున్నాయి. ఇప్పుడు పశ్చిమ వాయువ్య దిశగా కదులుతుంది... ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర ఒరిస్సా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో ఉత్తరకొస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా అక్కడక్కడ వర్షాలు పడడానికి ఆస్కారం ఉంది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. హబాలి ఖాతి నేచర్ క్యాంప్, ధమ్రాకు సమీపంలో తుపాన్ 'దానా' తీరం దాటిందని, రాత్రి 1:30 గంటల నుంచి శుక్రవారం తెల్లవారు జాము 3:30 గంటల మధ్య తీరం దాటిందన్నారు. ల్యాండ్‌ఫాల్ పక్రియ మరో 2-3 గంటల పాటు కొనసాగుతుందని, ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మధ్యాహ్నం నుంచి క్రమంగా బలహీన పడుతుందని, ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి కూర్మనాథ్ సూచించారు. మరోవైపు దానా తుపానుతో రాష్ట్రానికి ముప్పు తప్పింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించి బుధవారం నాటికి తుఫాన్‌గా బలపడింది. తరువాత వాయవ్యంగా గంటకు 12 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ రాత్రి 10 గంటలకు ఒడిసాలోని పారాదీప్‌కు 420 కి.మీ, ధామ్రాకు 450 కి.మీ, సాగర్ ద్వీపానికి (పశ్చిమ బెంగాల్) 500 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనికి ఒమన్ దేశం సూచించిన 'దానా' అని పేరు పెట్టారు. తుఫాను వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి ఈరోజు ఉదయానికి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఈ క్రమంలో తీవ్ర తుఫాన్ ఒడిసాలో తీరం దాటిన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు ముప్పు తప్పింది. తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో పలుచోట్ల చెదురుమదురు వర్షాలు మాత్రమే కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున ఈనెల 26 వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులలో రెండో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవులకు సమాచారం అందించారు.

# రైతులను దెబ్బతీసిన అకాల వర్షం

**ధాన్యం సేకరణ సత్వరం చేపట్టాలి**

**అనంతపురం,అక్టోబర్25:** అకాల వర్షాలతో అన్నదాత నిండా మునిగిపోయాడు. చేతికి అందివచ్చిన పంట నీటిపాలైంది. ఆరుకాలం కష్టించిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పలు మండలాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో అకాల వర్షంతో వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. కళ్లాల్లో ఆరబెట్టిన పంట పూర్తిగా తడిసిపోయింది. మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ముందస్తుగా రబీలో శనగ పంటను సాగు చేయగా అది కూడా వర్షం ధాటికి దెబ్బతింది. మిరప, ఉల్లి, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇకపోతే అనంతపురం జిల్లాను భారీ వరదలు ముంచెత్తాయి. గత పదేళ్లలో ఎన్నడూ లేనంత వరదలు వచ్చాయి. వర్షం.. జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లాలో ఉన్న పిల్ల కాలువ దగ్గర నుంచి వాగులు, వంకలు.. పొంగిపొర్లాయి. భూగర్భజలాలు పెరిగాయి. రోడ్లు డ్యామేజ్ అయ్యాయి. పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడిప్పుడే జిల్లాలో సాధారణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో చుక్క నీటి కోసం అల్లాడిపోయిన ప్రాంతాల్లో భారీ నీటి ప్రవాహాలు కనిపిస్తున్నాయి. నీటి ప్రవాహాల్లో పెద్ద ఎత్తున చేపలు కనిపిస్తుండటంతో జనం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. జిల్లాలో అనుకోకుండా వచ్చిన వరదలపై సకాలంలో స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాగలిగామని కలెక్టర్ డా.వి.వినోద్ కుమార్ తెలియజేశారు. పండమేరు పొంగిపొర్లు అనంతపురం శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. జిల్లాలో 456.92 హెక్టార్లలో వ్యవసాయ పంటలు నష్టమై రూ.2.66 కోట్లు, ఉద్యాన పంటలకు సంబంధించి 68.20 హెక్టార్లలో రూ.73.19 విలువజేసే నష్టం జరిగిందన్నారు. నష్టం అంచాన వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో నియమ నిబంధనలు పాటించాల్సి ఉందని, ఆ మేరకు అధికారులు నష్ట నివేదికలు అందించిన తర్వాత వారికి కూడా నష్టపరిహారం అందజేస్తామన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి 800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందన్నారు. చాగల్లు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. చిత్రావతి రిజర్వాయర్‌కు ఇంకా వరద నీరు రాలేదని, అయితే రిజర్వాయర్ నీటితో నిండిందన్నారు. హగరి, పెన్నా, చిత్రావతి, పండమేరు వంక పరివాహక ప్రాంతాల్లో ఇంకా వర్షం కురిస్తే నీరు పారుతుందని, ఈ విషయమై జిల్లాలో ప్రజలందరినీ అప్రమత్తం చేశామన్నారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రం సిద్ధంగా ఉందన్నారు.

# డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష

**డయేరియా అదుపులో ఉందని కలెక్టర్ల వివరణ**

**అమరావతి 25 :** పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం దాచేపల్లిలో డయేరియా అదుపులోనే ఉందని మంత్రికి కలెక్టర్ చెప్పారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యాధికారులు తెలిపారు. మరోవైపు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసి నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. కాగా.. దాచేపల్లిలో నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో డయేరియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వ్యాధి తీవ్రతతో ఇప్పటికే ఇద్దరు మృతువాత పడగా, 16 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పరిస్థితి. అయితే కలుషిత మంచి నీరు తాగడం వల్లే అతిసారం ప్రబలిందని అధికారులు నిర్ధారించారు. తాగునీటి పైపు లైన్లు మురుగు కాలువలో ఉండటం వల్ల నీరు కలుషితమై ఉండవచ్చని భావిస్తున్నారు. డయేరియాతో డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21), బండారు చిన వీరయ్య(63) మృతి చెందారు. వీరు ఇద్దరు మృతి చెందడంతో



అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి నేతృత్వంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందజేస్తున్నారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ శిరి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పరిస్థితిని సమీక్షించారు.

మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా దాచేపల్లి పరిస్థితిపై ఆరా తీసిన విషయం తెలిసిందే. డయేరియాతో ఇద్దరు చనిపోయిన విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం.. డయేరియాకు కలుషిత నీరు కారణమా లేక.. వేరే కారణాలు ఏమన్నా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే దాచేపల్లిలో పరిస్థితిని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. బోర్లను మూసి వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలంటూ సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఈరోజు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసిన నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి నారాయణ

కాగా ఉదయం మంత్రి నారాయణ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సంధ్బంగా మంత్రికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అలాగే ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని , చిత్రపటాన్ని మంత్రి నారాయణకు అందించారు.

## నౌక ఢీకొనడంతో కూలిన బాల్టిమోర్ వంతెన


**రూ.840 కోట్లు చెల్లించేందుకు అంగీకారం**




**న్యూయార్క్,అక్టోబర్25:** అమెరికాలోని బాల్టిమోర్‌లో నౌక ఢీకొనడంతో ఓ వంతెన కూలి పోయింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఈ ఘటనపై కార్గోషిప్‌కు చెందిన యజమానితో రూ.840 కోట్ల నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం జరిగినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. 'ఆరుగురి ప్రాణాలు బలిగొనడంతో పాటు భారీ నష్టాన్ని కలిగించిన ఈ ఘోరమైన ఘటనకు దాదాపు ఏడు నెలల తర్వాత పరిష్కారం లభించింది. మేము ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాం. గ్రేస్ ఓషన్ ప్రైవేట్ లిమిటెడ్, సినర్జీ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా 101.1 మిలియన్ డాలర్లు (రూ.840 కోట్లు) చెల్లించేందుకు అంగీకరించాయని న్యాయశాఖ అధికారి బెంజమిన్ మిజర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన పునర్నిర్మాణానికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఈ ఒప్పందంలో చేర్చలేదని న్యాయశాఖ వెల్లడించింది. ఇది మేరీల్యాండ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక దావా అంశమని పేర్కొంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కార్మికుల కుటుంబాలు దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నట్లు తెలిపింది. నౌక ఢీకొనడంతో పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన కుప్పకూలిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం.. మార్చి 25న అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఆ సమయంలో నౌకలో భారత సిబ్బంది సైతం ఉన్నారు. అయితే, ప్రమాదానికి ముందే వారు అధికారులను అప్రమత్తం చేయడంతో వంతెనపై రాకపోకలను నిలిపివేయ గలిగారు. దీంతో భారీస్థాయి ప్రాణనష్టం తప్పిందని అప్పట్లో అధికారులు వెల్లడించారు.

## దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

**కమలా గెలిస్తే చైనా ఆడేసుకుంటుందున్న ట్రంప్**







**వాషింగ్టన్,అక్టోబర్25:** అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధ్యక్ష అభ్యర్థుల ప్రచారం మరింత జోరందుకుంది. ఓటర్లను ఆకట్టుకోవడం కోసం హామీలతో పాటు పరస్పర విమర్శలతో ప్రచారం అంతకంతకూ వేడెక్కుతోంది. తాజాగా అగ్రరాజ్య ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ పై రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఆమె అధికారంలోకి వస్తే చైనా ఆడేసుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రచారంలో భాగంగా ట్రంప్ ఓ రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా హోస్ట్ మాట్లాడుతూ.. ఒకవేళ కమలాహారిస్ విజయం సాధిస్తే ఆమె చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరపాల్సి ఉంటుంది. అప్పుడు ఆమెతో జిన్‌పింగ్ ఎలా వ్యవహరిస్తారని ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి మాజీ అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఓ చిన్న పిల్ల మాదిరిగా ఆమెను చూస్తారని అంటూ వ్యాఖ్యానించారు. ఆమెను చిన్న పిల్లను చేసి చాక్లెట్లను లాగేసినట్లు మనదంతా దోచుకుంటారు. ఏం జరుగుతుందో కూడా ఆమెకు అర్థం కాదు. చెస్‌ను అప్పుడే మొదలుపెట్టిన ఆటగాడితో గ్రాండ్ మాస్టర్ ఆడితే ఎలా ఉంటుందో.. వారిద్దరి చర్చలు కూడా అలాగే ఉంటాయని అంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. ఆమెకు మరో నాలుగేళ్లు అధికారిమిస్తే ప్రజల జేబులన్నీ ఖాళీ చేస్తారంటూ దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ట్రంప్, హారిస్ మధ్య ఉత్కంఠ పోరు ఉండనున్నట్లు పోల్ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఈ సర్వేల్లో మొన్నటివరకు హారిస్ ఆధిక్యంలో ఉండగా.. తాజాగా ట్రంప్ కాస్త ముందంజలోకి వచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన సర్వేలో ట్రంప్‌నకు 47శాతం మద్దతు రాగా.. హారిస్‌కు 45శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక, సీఎన్‌బీసీ ఆల్ అమెరికన్ ఎకనమిక్ సర్వేలోనూ ట్రంప్ .. హారిస్ కంటే రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. అటు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉండనున్నట్లు సర్వేలు అంచనా వేస్తున్నాయి.

## దంతేరాస్ రోజు..బంగారమే కొనాలని లేదు

**తమలపాకులతోనూ లక్ష్మీదేవినిపూజించవచ్చు**

**ముంబై,అక్టోబర్25:** ధన్ తేరాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందరికీ ఈ పండుగ గురించి తెలుసు. ధంతేరాస్ రోజు ధన్వంతరీని పూజిస్తారు. ధన్వంతరీని పూజించడం వల్ల ఆర్థిక కష్టాలు, అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్న నమ్మకం. ఈ ధంతేరాస్ నుంచే దీపావళి పండుగ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది అక్టోబర్ 29న ధంతేరాస్ వస్తుంది. ఈ రోజున చాలా మంది బంగారం, వెండి ఆభరణాలను కొనుగోలు చేస్తారు.బంగారం, వెండి వస్తువులు, ఆభరణాలను కొనలేని వారు కూడా ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు చెప్పే వాటిని కొన్నా చాలా మంచిదని, ఆర్థికంగా బలపడతారని పండితులు చెబుతారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఇంట్లో ఎలాంటి శుభకార్యాలను తలపెట్టినా తమలపాకులను ఉపయోగిస్తూ ఉంటారు. తమల పాకులను లక్ష్మి దేవి స్వరూపంగా కూడా భావిస్తారు. ధంతేరస్ రోజున తమల పాకులు కొని లక్ష్మి దేవికి నైవేద్యంగా పెడితే.. ఆ జగన్మాత ఆశీస్సులు లభిస్తాయని అంటారు. ఆ తర్వాత రోజు వాటిని ఓ పవిత్ర నదిలో వదిలేయడం మంచిది. అలాగే కొత్తిమీర కొని ఇంటికి తీసుకొచ్చినా కూడా చాలా మంచిది. కొత్తి మీరను కూడా సంపదకు చిహ్నంగా భావిస్తారు. కాబట్టి ఈ రోజున కొత్తిమీరను కొంటే డబ్బుకు లోటు ఉండదు. పసుపు, కుంకుమలు అమ్మవారికి ప్రీతికరంగా భావిస్తారు. కాబట్టి ధంతేరాస్ రోజున పసుపు, కుంకుమ కొని ఇంటికి తీసుకురావచ్చు. దీని వలన స్త్రీలకు వైవాహిక జీవితం సంతోషంగా ఉంటుంది. అదృష్టాన్ని కూడా తెచ్చిపెడుతుంది. ధంతేరస్ రోజున చీపుర్లు కొంటే చాలా మంచిది. ఎందుకంటే చీపురును లక్ష్మి దేవితో సమానంగా భావిస్తారు. ఆ రోజున చీపురు కొని ఇంటికి తీసుకొస్తే.. ఐశ్వర్యం, అదృష్టం కలిసి వస్తుందట. ఇంట్లో గొడవలు కూడా తగ్గుతాయి. పేదవారికి చీపుర్లు, చెప్పులు, గొడుగులు కొని ఇచ్చినా మంచిదే. ధంతేరాస్ రోజు ఉప్పు కొన్నా చాలా మంచిది. ఉప్పును కూడా ఎంతో పవిత్రంగా చూస్తారు. ఉప్పును లక్ష్మి దేవిగా భావిస్తారు. కాబట్టి ఈ రోజున ఉప్పును కొని ఇంటికి తీసుకొచ్చినా మంచిదే. బంగారం,వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ వాటిని కొనాలన్న నిబంధన ఏదీ లేదని కూడా అంటున్నారు. వ్యాపార ప్రకటనల మోజులో పడి ఇల్లు గుల్ల చేసుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

## అప్పుల బాధతో టెక్కీ ఆత్మహత్య

**హైదరాబాద్,అక్టోబర్25:** అప్పుల బాధతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కోకాపేటలో చోటుచేసుకుంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తణుకు పట్టణానికి చెందిన నాగ ప్రభాకర్ (27) గచ్చిబౌలిలోని హాస్టల్‌లో ఉంటూ కోకాపేటలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో కోకాపేటలోని విరూపాక్ష మెన్స్ హాస్టల్ 7వ అంతస్తు పైనుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101